సాక్షి అనకాపల్లి

సోమవారం । 10 । మార్చి । 2025




గురుకులం పిలుస్తోంది..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలకు, కళాశాలల్లో 2025–26 సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. 8లో



వడ్డాది వెంకన్నకు కల్యాణ శోభ

ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి క్షేత్రం కల్యాణ శోభతో కాంతులీనుతోంది. 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	సోమ	మంగళ
అనకాపల్లి	6.10	4.54
నర్సీపట్నం	6.12	4.51

అధికారులే ఆయిల్ తాగేశారు!

నెలకు అదనంగా రూ.30 లక్షల ఆయిల్ వినియోగం

అధికారులకు అధికారులే మామూళ్ల ఆఫర్



- ఫాగింగ్ యంత్రాల ఆయిల్ బిల్లు రూ.68 లక్షలకు పెంచేశారు..
- ప్రతి నెలా పబ్లిక్ హెల్త్, మెకానికల్ అధికారులకు లంచాలు
- డిప్యూటేషన్‌పై వచ్చిన ఓ అధికారికి పంపకాల బాధ్యత
- గత కమిషనర్ హయాంలో క్షేత్రస్థాయిలో పరిశీలన
- నెలకు అదనంగా రూ.30 లక్షలు కొట్టేస్తున్నారని స్పష్టం
- ఇప్పటికీ చర్యలు తీసుకోని వైనం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

సాధారణంగా ఏదైనా పనిచేసే కాంట్రాక్టర్.. అధికారులకు లంచాలు ఇవ్వడం పరిపాటి. అయితే ఘనత వహించిన జీవీఎంసీలో మాత్రం అధికారులే అధికారులకు లంచాలు ఇస్తున్నారు. తమకు ఇంత మొత్తం బిల్లు ఆయిల్ కోసం ఇస్తే.. మీకు ఇంత మొత్తం ప్రతి నెలా లంచం ముట్టచెబుతామంటూ ఆఫర్లు ఇస్తుండటం గమనార్హం. మెకానికల్ విభాగం, ప్రజారోగ్య విభాగానికి చెందిన అధికారుల మధ్య జరిగిన ఈ డీల్‌తో జీవీఎంసీకి భారీ నష్టం జరిగింది. గతంలో మెకానికల్ విభాగంలో పనిచేసిన ఓ అధికారితో పాటు జీవీఎంసీకి డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు అధికారుల మధ్య లాలూచీతో వ్యవహారం సాఫీగా సాగింది. వాస్తవానికి ఫాగింగ్ యంత్రాల కోసం గతంలో రూ.38 లక్షల మేర నెలవారీగా బిల్లు ఉండగా.. దానిని ఏకంగా రూ.68 లక్షలకు పెంచేశారు. దీనిపై గత నెలలో అప్పటి కమిషనర్ ఆధ్వర్యంలో విచారణ చేయగా.. రూ.38 లక్షల మేర ఆయిల్ బిల్లు సరిపోతుందని తేలింది. తద్వారా నెలకు రూ.30 లక్షల మేర అధికంగా ఆయిల్ పేరుతో లాగేసినట్టు విచారణలో బయటపడింది. ఈ నేపథ్యంలో సదరు మెకానికల్ అధికారిపై ఈ వ్యవహారంతో పాటు ఇతర ఫిర్యాదులు రాగా బదిలీ వేటు పడింది. అయితే డిప్యూటేషన్‌పై ఉన్న మరో ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఈలోగా కమిషనర్ బదిలీతో ఈ వ్యవహారం మూలకు చేరింది. ఈ వ్యవహారంలో అడిగినంత మేర ఆయిల్ ఇచ్చినందుకు ప్రతిఫలంగా ఇద్దరు అధికారులకు మరో అధికారి ప్రతి నెలా రూ.2 లక్షల చొప్పున మామూళ్లు ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న కలెక్టర్ ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

తనిఖీలో తేలిందిలా..

ఫాగింగ్ యంత్రాలకు ప్రతి నెలా సుమారు రూ.30 లక్షల మేర అదనపు ఆయిల్ వినియోగం జరుగుతుండటంతో, మెకానికల్ విభాగానికి కొత్తగా వచ్చిన అధికారికి అనుమానం కలిగింది. దీంతో ఆయన ఈ విషయాన్ని గత కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆయన ఆదేశాల మేరకు ఫాగింగ్ యంత్రాలకు గంటకు ఎంత ఆయిల్ అవసరమవుతుందో ముగ్గురు అధికారులు విచారణ చేపట్టారు. వాస్తవానికి ఈ ఫాగింగ్ యంత్రాలకు గంటకు 40 నుంచి 45 లీటర్ల ఆయిల్ సరిపోతుందని విచారణలో తేలింది. అయితే గతంలో పనిచేసిన అధికారి మాత్రం ఏకంగా 120 లీటర్ల చొప్పున ఆయిల్ మంజూరు చేయడం గమనార్హం. ఫాగింగ్ పనులను పర్యవేక్షించే డిప్యూటేషన్ అధికారి, ప్రజారోగ్య విభాగంలోని ముఖ్య అధికారులు అడిగిన దాని ప్రకారమే గత అధికారి మంజూరు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా ఫాగింగ్ వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యత కలిగిన ఆ డిప్యూటేషన్ అధికారి మామూళ్ల వ్యవహారాలను కూడా చూస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఆ అధికారి ప్రతి నెలా మెకానికల్, ప్రజారోగ్య శాఖ అధికారులకు క్రమం తప్పకుండా మామూళ్లు అందజేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత కమిషనర్ ఫాగింగ్ వ్యవహారాల పర్యవేక్షణాధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించినప్పటికీ, ఆయన బదిలీ, ఎన్నికల నియామవళి అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న కలెక్టరు దృష్టికి ఈ విషయం వెళ్లకుండా కొందరు జాగ్రత్తగా కాపాడే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

అడ్డగోలుగా ఆయిల్ సరఫరా

జీవీఎంసీలో ఫాగింగ్ మిషన్లు పెద్దవి 8, మీడియం సైజువి 80 ఉండగా, స్ప్రింక్లర్లు 25 ఉన్నాయి. వీటికి ప్రతి నెలా గతంలో రూ.38 లక్షల మేర ఆయిల్ బిల్లు చెల్లించేవారు. అయితే డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు అధికారులు, మెకానికల్ విభాగంతో కుదుర్చుకున్న మామూళ్ల ఒప్పందంలో భాగంగా ఈ బిల్లును ఏకంగా రూ.68 లక్షలకు పెంచేశారు. ఇందుకు ప్రతిఫలంగా ఆ ఇద్దరు అధికారులకు ప్రతి నెలా రూ.2 లక్షల చొప్పున ముట్టజెప్పే విధంగా ఒప్పందం కుదిరినట్టు సమాచారం. మలేరియా విభాగం వారు అడిగిన మేరకే తాము ఆయిల్ కార్డులను ఇచ్చామని మెకానికల్ విభాగంలో పనిచేసిన అధికారి చెబుతున్నట్టు సమాచారం. గతానికి భిన్నంగా ఒకేసారి రెట్టింపు స్థాయిలో ఆయిల్ వినియోగం పెరిగితే కనీసం విచారణ చేయాల్సిన మెకానికల్ విభాగం అధికారి, ఎటువంటి ప్రశ్నలు వేయకుండా ఆయిల్‌ను తీసుకునేందుకు అనుమతి ఇచ్చారు. సదరు అధికారులకు అధికార పార్టీ నేతల నుంచి మద్దతు కూడా ఉండటంతో ఎవరూ తమను ఏమీ చేయలేరనే ధీమాతో అడ్డగోలుగా ఆయిల్ పంపిణీకి తెరలేపారు. ఈ వ్యవహారంలో కొందరు అధికార పార్టీ కార్పొరేటర్లకు కూడా నెలవారీగా మామూళ్లు అందినట్టు తెలుస్తోంది. రాబోయే కాలానికి కాబోయే మేయర్‌నని చెప్పుకుంటున్న నేత వద్ద ఉండే ఇద్దరు కార్పొరేటర్లకు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

నేడే ఉపమాక వెంకన్న కల్యాణం

- ఘనంగా అంకురార్పణ
- మాడవీధుల్లో పెళ్లి కావిడి ఊరేగింపు
- స్వర్ణాభరణాలతో దర్శనమివ్వనున్న స్వామివారు
- విద్యుద్దీపకాంతులతో మెరుస్తున్న ఆలయం



స్వామివారి పెళ్లి కావిడిని ఊరేగిస్తున్న అర్చకులు



ఉపమాకలో స్వామివారి తిరువీధి ఉత్సవం

నక్కపల్లి: ఉత్తరాంధ్ర ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక గరుడాద్రి పర్వతంపై వెంకన్న వార్షిక తిరుకల్యాణోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పరిషత్, కంకణ ధారణ అంతరాలయ దేవతాపూజ, మత్స్యంగ్రహణ నిర్వహించారు. నిత్య సేవాకాలంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ గోష్టి ప్రసాద వినియోగం జరిపారు. అంకురార్పణ పూజా కార్యక్రమాల్లో భాగంగా హంసవాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారి కల్యాణ మండపంలో ఉభయదేవేరులను ఉంచి సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి పుట్టమన్ను తెచ్చేందుకు తీసుకెళ్లారు. దీన్నే అంకురార్పణ అంటారు. అనంతరం వాస్తు మండప పూజ, యోగీశ్వరపూజ, అగ్నిప్రతిష్టాపన, జయాది హోమాలు జరిగాయి. గరుడ ప్రాణప్రతిష్ట విశేషహోమాలు, నీరాజన మంత్ర పుష్ప కార్యక్రమం నిర్వహించి గరుడప్పాలు నివేదన చేశారు. అష్టదిక్పాలకులకు ఆవాహన కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారి పెళ్లికావిడిని ఉపమాక మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి పసుపు కుంకుమలు, కొబ్బరిబొండాలు కానుకలుగా సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమాలతో స్వామివారి కల్యాణోత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయని ఆలయప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. పెళ్లికావిడి ఊరేగింపులో అర్చకులు కృష్ణమాచార్యులు, గోపాలాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, సాయి ఆచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

నేడే స్వామివారి కల్యాణం

స్వామివారి కల్యాణం సోమవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా జరగనుంది. అదేరోజు సాయంత్రం కన్యావాద సంవాదం (ఉపమాక సింహాద్రాచార్యులు ఇంటి వద్ద స్వామివారి అమ్మవార్ల పెండ్లిమాటలు, గుణగణాలను వివరించే తంతును నిర్వహిస్తారు) తరిగొండ వేంగమాంబ సాహితీ పీఠం వ్యవస్థాపకురాలు, వేద పండితురాలు డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించి కన్నుల పండువగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం రథోత్సవం జరుగుతుంది. తదుపరి స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు దేవస్థానం వారు ఏర్పాట్లు చేశారు. 12వ తేదీ పండిత సభ, 13వ తేదీన స్వామివారికి గజవాహనంపై తిరువీధి సేవ,14న పౌర్ణమినాడు రాజయ్యపేట సముద్రతీరంలో స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రికి డోలోత్సవం, అద్దపు సేవ జరుగుతుంది. 15 నుంచి 17 వరకు స్వామి వారి పుష్పయాగోత్సవాలు జరుగుతాయి. కల్యాణ తంతును నిర్వహించేందుకు తిరుచానూరు పద్మా వతి ఆలయానికి చెందిన ప్రముఖ వేదపండితులు, ఆగమశాస్త్రసలహాదారులను రప్పిస్తున్నారు.

విస్తృత ఏర్పాట్లు

కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంతోపాటు, గోపురాలు, బేడామండపం, ఆస్థాన మండపం, కల్యాణమండపాలకు రంగురంగుల విద్యుద్దీపాలను అలంకరించారు. టీటీడీ సిబ్బంది, పోలీసు సిబ్బంది సుమారు 300 మంది విధుల్లో పాల్గొంటున్నారు. భక్తుల కోసం ప్రత్యేక స్నానఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

స్వర్ణాభరణాలతో దర్శనమివ్వనున్న స్వామివారు

వజ్ర వైఢూర్యాలు, కెంపులు, పచ్చల హారం, కాసులపేర్లు, మరకత మాణిక్యాలు, బంగారంతో తయారు చేసిన శంఖు, చక్రం, హస్తాలు, వజ్రాలు పొదిగిన కిరీటాలు, హారాలు, చంద్రహారాలు, స్వర్ణ వజ్రకవచం ఇలా స్వామివారికి వెలకట్టలేనన్ని ఆభరణాలున్నాయి. వీటిని స్వామివారికి అలంకరించి ఐదురోజుల పాటు భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

ఘనంగా బౌద్ధ సమ్మేళనం

- బొజ్జన్నకొండ వద్ద శాంతి ర్యాలీ
- బుద్ధ భూమి మాసపత్రిక ఆవిష్కరణ



బుద్ధుని కొండమీదకు శాంతి ర్యాలీ



కొండ మీద బుద్ధుని విగ్రహం వద్ద ప్రార్థనలు

అనకాపల్లి టౌన్: ప్రపంచానికి మొట్ట మొదటిసారిగా శాంతి, ధర్మం, అహింసా మార్గాలను బోధించిన మహానుభావుడు బుద్ధుడని రాష్ట్ర మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మండలంలోని శంకరం ప్రముఖ బౌద్ధ పర్యాటక క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద బౌద్ధ సమ్మేళనం ఘనంగా ఆదివారం జరిగింది. జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పల్లా బాబ్జీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా కొండ మెట్ల మార్గం గుండా బుద్ధుని విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధులు, బౌద్ధ ఉపాసకులు, బౌద్ధ అభిమానులు, విదేశీ బౌద్ధ భిక్షువులు వెనరబుల్ పూజ్య బ్రరామో బాంతేజీ (కంబోడియా), రాజాభాం తేజీ(బర్మా)లు పాల్గొని ప్రార్థనలు నిర్వహించి ప్రపంచ శాంతి స్థాపనకు అందరూ దోహద పడాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా బుద్ధభూమి మాస పత్రికను ఆవిష్కరించారు. రాష్ట్ర బుద్దిస్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వై హరి బాబు, విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మాటూరి శ్రీనివాస్, బౌద్ధ సంఘాల ప్రతినిధులు బొడ్డు కల్యాణరావు, పి.రాం బాబు, ఎస్.గంగాధర్, వి.వి.దుర్గారావు, బోర వేణు గోపాల్, బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రచార కమిటీ సభ్యుడు బల్లా నాగభూషణం పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రామకొండలరావు



మాడుగుల రూరల్: విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, మాడుగుల ప్రఖండ్ బాధ్యులు రాపేట రామకొండలరావు మాస్టరును నియమించారు. ఈ నెల 8,9, తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలో గల వీరంపాలెం గ్రామంలో గల బాల త్రిపుర సుందరీ సహిత, పరమేశ్వర ఆలయంలో జరిగిన విశ్వ హిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రాంత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలో 19 జిల్లాలకు చెందిన విశ్వహిందూ పరిషత్ బాధ్యులు హాజరయ్యారు. దీనికి కేంద్ర కమిటీ బాధ్యులు కోటేశ్వరశర్మ, ఉత్తరాంధ్ర ప్రాంత అధ్యక్షుడు వెంకటేశ్వరావు, ప్రాంత కార్యదర్శి సుబ్బరాజు, ఉత్తరాంధ్ర జిల్లాల కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో జిల్లా వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడిగా రామకొండలరావును నియమించారు. రామకొండలరావు గతంలో మాడుగుల మండల వీహెచ్‌పీ అధ్యక్షుడిగా పనిచేశారు. అప్పట్లో అయోధ్య నుంచి తీసుకొచ్చిన శ్రీరాముని అక్షింతలను ఆర్‌ఎస్ఎస్, వీహెచ్‌పీ, సమరతాసేవా ఫౌండేషన్ సభ్యుల సహకారంతో గ్రామాల్లో పంపిణీ చేశారు. మండలంలో 56 గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేశారు.

కార్మికుల భద్రతతోనే స్వర్ణాంధ్ర సాకారం

- రాష్ట్ర కార్మిక, కర్మాగార బాయిలర్, వైద్య బీమా సర్వీసుల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- జాతీయ భద్రతా వారోత్సవాల ప్రారంభం



భద్రతా వారోత్సవాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్, కలెక్టర్ విజయకృష్ణన్, యలమంచిలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ర్యాలీగా వస్తున్న వివిధ పరిశ్రమల కార్మికులు

అనకాపల్లి: జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని కార్మికులతో పాటు సామాన్య ప్రజలకు భద్రత పట్ల అవగాహన కల్పించాలని రాష్ట్ర కార్మిక, కర్మాగార బాయిలర్, వైద్య బీమా సర్వీసుల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో కలెక్టర్ విజయకృష్ణన్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌లతో కలసి ఆయన ఆదివారం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల భద్రంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుందని, కార్మికుల భద్రతతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారం అవుతుందన్నారు. కార్మికుల భద్రతకు ప్రభుత్వమే కాకుండా యాజమాన్యం కూడా బాధ్యత వహించి వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. జిల్లాలో 884 పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో 205 ప్రమాదకరమైన కార్యకలాపాలు నిర్వహించే పరిశ్రమలు ఉన్నాయని, ఈ పరిశ్రమలన్నింటిలో సుమారుగా లక్షా 28వేల మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్మికులతో పాటు విద్యార్థులందరికీ భద్రత పట్ల అవగాహన కల్పించాలని కోరారు. సేఫ్టీ అండ్ వెల్ బీయింగ్ కృషియల్ ఫర్ వికసిత్ భారత్–2047 అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి సలహాలు ఇవ్వడానికి వసుధ మిశ్రా నేతృత్వంలో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ పరిశ్రమలలో ప్రమాదాలపై కార్మికులకు మాక్ డ్రిల్ నిర్వహించి భద్రతపై శిక్షణ ఇవ్వాలన్నారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ యాజమాన్యం, కార్మికుల సంయుక్త కృషితో జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ప్రతి కార్మికునికి బీమా సహాయం అందాలంటే ఆయా పథకాలలో నమోదు కావాలని ఆయన కోరారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌మూర్తి, కర్మాగార సంయుక్త ముఖ్య తనిఖీ అధికారి జె.శివశంకర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్ర జీఎం నాగరాజారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, నేవీ, ఫైర్ సర్వీసస్, హెచ్‌పీసీఎల్, ఎన్‌టీపీసీ, హెటిరో ఫార్మా కంపెనీ యాజమాన్యం, పట్టణ సీఐ టి.వి.విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ పాల్గొన్నారు.

చెరకు రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ

పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు అన్నారు. ఆదివారం తారువలో ఆయన మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో చెరకు రైతులతో సోమవారం నిర్వహించే ముఖాముఖి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ హాజరై చెరకు రైతులు, కార్మికుల సమస్యలు, కష్టనష్టాలను అడిగి తెలుసుకుంటారన్నారు. వీటిపై శాసన మండలిలో ప్రస్తావించడంతోపాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ముఖాముఖి కార్యక్రమానికి ఫ్యాక్టరీ చెరకు రైతులు, పార్టీ నాయకులు తరలిరావాలని కోరారు.

ఉక్కులో ఉత్పత్తికి అంతరాయం

సాక్షి, విశాఖపట్నం : స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్‌కు అవసరమైన పల్వరైజ్డ్ కోల్ సరఫరా నిలిచి పోవడంతో ఆ విభాగంలో ఉత్పత్తికి అంతరాయం కలిగింది. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ) విభాగంలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో కన్వేయర్ బెల్ట్ కొంత మేర కాలిపోవడంతో పల్వరైజ్డ్ కోల్ సరఫరా నిలిచిపోయింది.

దినదిన గండం ‘గోవాడ’ భవితవ్యం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మనుగడ దినదినగండంలా ఉంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న ఫ్యాక్టరీకి ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌లో ఎదురవుతున్న సమస్యలు మరింతగా కుంగదీస్తున్నాయి. మరో పక్క ఫ్యాక్టరీని, చెరకు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, నాయకులు చేతులెత్తేయడంతో ఇప్పుడు ఫ్యాక్టరీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

- ఆర్థిక ఇబ్బందులతో సుగర్ ఫ్యాక్టరీ సతమతం
- నిధులు తెస్తామని కనిపించకుండా పోయిన ఎంపీ, ఎమ్మెల్యే
- ఫ్యాక్టరీ మనుగడపై ఆందోళన చెందుతున్న చెరకు రైతులు, కార్మికులు
- నేడు వైఎస్సార్‌సీపీ, సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో ఆందోళన
- నేడు శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ గోవాడ రాక



చోడవరం: రైతులకు చెరకు పేమెంట్స్ ఇవ్వలేక, కార్మికులకు జీతభత్యాలు చెల్లించలేక, పాత బకాయిలు చెల్లించలేక, క్రషింగ్‌కు కావలసిన సామగ్రికి అవసరమైన ఆర్థిక స్తోమత లేక గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చాలా దయనీయ స్థితిలో ఉంది. 23,450 మంది సభ్య రైతులు ఉన్న ఈ ఫ్యాక్టరీ నేడో రేపో మూసివేసే దుస్థితికి రావడం రైతులను, కార్మికులను ఆందోళనకు గురిచేస్తోంది. 2019 సంవత్సరానికి ముందు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఫ్యాక్టరీ పాలకమండలిలో ఉన్న టీడీపీ పాలకవర్గం సుమారు రూ. 150 కోట్లు అప్పుల ఊబిలోకి నెట్టింది. అప్పట్లో అధికారంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఒక్క రూపాయి కూడా ఫ్యాక్టరీకి ఆర్థికసాయం అందించలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఫ్యాక్టరీని ఆదుకుంది. ప్రభుత్వ విప్ హోదాలో అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఉప ముఖ్యమంత్రిగా బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖామంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ ఈ ఫ్యాక్టరీని కాపాడడానికి ఎంతో కృషి చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా సానుకూలంగా స్పందించి ఐదేళ్లలో రూ.89 కోట్లు ఆర్థిక సాయం అందించారు. దీంతో ఫ్యాక్టరీ నెమ్మదిగా అప్పుల ఊబిలోంచి కొంతమేర బయట పడింది. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం గడిచిన పది నెలల్లో ఒక్క రూపాయి కూడా ఫ్యాక్టరీకి సాయం ఇవ్వలేదు. మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యాక్టరీని ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు ఉప ఉత్పత్తుల యూనిట్లు నెలకొల్పి ఫ్యాక్టరీని పూర్తిగా అభివృద్ధి చేసి చెరకు టన్నుకి రూ. 4వేలు గిట్టుబాటు ధర కల్పిస్తామని కూటమి నేతలు ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. ఈ ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమైపోయాయి. ఎప్పుడో 1962లో 1000 టన్నుల కెపాసిటీతో స్థాపించిన ఈ ఫ్యాక్టరీ దశలవారీగా కెపాసిటీ స్థాయి పెంచుకుంటూ ప్రస్తుతం 5.2 లక్షల టన్నుల క్రషింగ్ కెపాసిటీకి వచ్చింది. కానీ మిషనరీ అంతా 30, 40 యేళ్ల నాటిదే కావడంతో పాత మిషనరీతో తరుచూ క్రషింగ్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అత్యవసరంలో రూ. 9 కోట్లు ప్రభుత్వం సాయంగా అందిస్తే తప్పా తాత్కాలికంగా ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బంది నుంచి గట్టెక్కలేని పరిస్థితి ఉంది. రాష్ట్ర సహకార రంగంలో 11 ఫ్యాక్టరీల్లో అన్నీ ఇప్పటికే మూతబడిపోగా ఒక్క గోవాడ ఫ్యాక్టరీలో నడుస్తోంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో 4 ఫ్యాక్టరీలకు సుమారు రూ. 200 కోట్లు వరకూ ఆర్థికసాయం అందించి, కార్మికులు, రైతుల పాతబకాయిలన్నీ చెల్లించారు. కూటమి ప్రభుత్వం ఈ ఒక్క ఫ్యాక్టరీని ఆదుకోవడానికి ఎందుకు స్పందించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ఇచ్చిన మాటలు ఏమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు చెరకు రైతులతో ఆందోళన

ఫ్యాక్టరీని, చెరకు రైతులను ఆదుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ, సీపీఎం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఈనెల 10వ తేదీన చెరకు రైతులతో కలిసి ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యాయి. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం ఉదయం 10గంటలకు సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళనకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు వస్తున్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 3గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో చెరకు రైతులతో ఆందోళన చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఆందోళనలో ఆ పార్టీ నుంచి శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పాల్గొననున్నారు. ఆయనతోపాటు మాజీ ఉప ముఖ్యమంత్రి, జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి, స్థానిక సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్, అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు కరణం ధర్మశ్రీ పాల్గొని రైతుల తరపున మద్దతుగా ఉద్యమించేందుకు సిద్ధమయ్యారు.

గోవాడ చెరకు రైతులతో నేడు ముఖాముఖి

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

-వివరాలు 8లో



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

క్లుప్తంగా

ఐయితంపూడిలో బంగారు నగలు చోరీ

బుచ్చెయ్యపేట: మండలంలోని ఐయితంపూడి గ్రామంలో ముచ్చకర్ల బుర్రయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆయన పది రోజుల క్రితం తన భార్య చిలుకమ్మతో కలిసి పొట్టకూటి కోసం రాజమండ్రి వద్ద రబీ వరి పనులకు వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని ఆదివారం తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో దాచిన మూడు తులాలు బంగారం, 10 తులాలు వెండి వస్తువులతోపాటు రూ.20 వేలు చోరీ చేసినట్లు గుర్తించారు. దీనిపై బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావుకు సమాచారం అందించగా డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వచ్చి విచారణ చేస్తున్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతి

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్లే మార్గంలో బయ్యవరం కూడలి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నడిచి రోడ్డు దాటుతున్న యువకుడు(30) అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవన్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో బంధువుల కోసం భద్రపరిచామన్నారు. సంబంధికులు ఎవరైనా ఉంటే 9440796088, 7780620619 సంప్రదించాలని కోరారు.

చెరువులో పడి యువకుడి మృతి?


మృతుడు సూర్యలక్ష్మి నారాయణ(ఫైల్)

పరవాడ: మండలంలోని భర్నికం గ్రామానికి చెందిన బలిరెడ్డి సూర్య లక్ష్మీనారాయణ(32) చెరువులో చేపల వేటకు దిగి నీటిలో మునిగిపోయి మృతి చెందినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో స్నేహితులతో కలిసి లక్ష్మీనారాయణ ఆదివారం మధ్యాహ్నం చేపల పట్టడానికి చెరువులో దిగాడు. చేపల వేట సాగిస్తూ నీటిలో మునిగిపోయి ఎంతకి రాకపోవడంతో తోటి స్నేహితులు పరవాడ పోలీసులకు, బంధువులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టినా రాత్రి వరకు మృతదేహం లభ్యం కాలేదు. సోమవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు సీఐ మల్లికార్జునరావు చెప్పారు. గాలింపు చర్యల్లో పరవాడ ఎస్ఐ మహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చాపరాయి వెలవెల

డుంబ్రిగుడ: చాపరాయి పర్యాటక కేంద్రంలో ఆదివారం సందర్శకులు అంతంతమాత్రంగా కనిపించారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరగడం, కొద్ది రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులు చదువుల్లో నిమగ్నమయ్యారు. వారి కుటుంబ సభ్యులు విహారాలకు దూరంగా ఉంటున్నారు.

గురుకులం పిలుస్తోంది..

- ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 13 వరకు గడువు


కొక్కిరాపల్లి గురుకులంలో ప్రత్యేక పునశ్చరణ తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థినులు


కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం

యలమంచిలి రూరల్: పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యనందించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలకు, కళాశాలల్లో 2025–26 సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7 గురుకులాల్లో రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి ఆంగ్ల మాధ్యమంలో ఐదో తరగతి,ఇంటర్ మొదటి సంవత్సరాల్లో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.5 బాలికలు,2 బాలురు పాఠశాలలు, కళాశాలల్లో ఐదో తరగతిలో 560, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 560 సీట్లు భర్తీ చేయనున్నారు.జిల్లాలో నక్కపల్లి, కొక్కిరాపల్లి, తాళ్లపాలెం,నర్సీపట్నం, కోనాంలలో బాలుకలు,దేవరాపల్లి మండలం తెనుగుపూడి, గొలుగొండల్లో బాలురకు గురుకులాలు ఉన్నాయి. ప్రవేశాల కోసం ఈ నెల 13వ తేదీ వరకు గడువు ఉంది. ఆసక్తి గల విద్యార్థులు తమ దరఖాస్తులను గడువులోగా ఆన్‌లైన్‌లో పంపించాలి. ఈ గురుకులాల్లో 5వ తరగతిలో ఒకసారి ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు.

పరీక్ష ఇలా..

ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు,ఇంటర్‌లో చేరే వారికి అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఐచ్ఛిక విధానంలో ప్రవేశ పరీక్ష ఉటుంది.ప్రతి తప్పు జవాబునకు 1/4 మార్కు (నెగెటివ్) మార్కు తీసివేస్తారు.ఐదో తరగతికి సంబంధించి నాలుగో తరగతిలో తెలుగు 10,ఆంగ్లం 10,గణితం 15,సైన్స్ 15 కలిపి మొత్తం 50 ప్రశ్నలు(ఒక మార్కు) ఉంటాయి.

ఇంటర్‌కు సంబంధించిన ప్రవేశ పరీక్షలో పదో తరగతిలో గణితం 15, భౌతికశాస్త్రం 15,సామాన్య శాస్త్రం(బయాలజీ) 15,ఆంగ్లం 15,సామాజిక అధ్యయనాలు 10,లాజికల్ రీజనింగ్ అండ్ ఆప్టిట్యూడ్ 30 కలిపి మొత్తం 100 ప్రశ్నలు(ఒక మార్కు) ఉంటాయి.

అర్హతలు

ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు 2012 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య,ఓసీ,బీసీ,ఎస్సీ కన్వెర్టెడ్ క్రిస్టియన్లు 2014 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి 2025 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్ల వయసు మించకూడదు.ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న వారు మాత్రమే అర్హులు.అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించకూడదు.అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో httpr://apbragcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 13 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. దరఖాస్తులు చేసేటపుడు తప్పులు లేకుండా చూసుకోవాలి. నమోదు సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్ కార్డు, ఇంతకు ముందు తరగతికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు ఉండాలి.మొబైల్ నెంబరు తప్పులేకుండా నమోదయ్యేలా చూసుకోవాలి. ప్రతిభ పరీక్షలో మెరిట్ ఆధారంగా నేరుగా ప్రవేశం కేటాయిస్తారు.

వసతులు: ఉచిత వసతి, భోజన సౌకర్యంతో గురుకుల విధానంలో చదువుకునే అవకాశం ఉంది. పౌష్టికాహారం, మూడు జతల ఏకరూప దుస్తులు, దుప్పటి లేక జంకాన, బూట్లు, సాక్సులు, టై, బెల్టు, రాత, పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందిస్తారు. కాస్మోటిక్ ఛార్జీలు, రోజూ వేరుశనగ చిక్కీ, వారానికి ఆరు రోజులు గుడ్లు, రెండు రోజులు చికెన్‌తో భోజనం ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి..



ఆంగ్ల మాధ్యమంలో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఒత్తిడి లేని నాణ్యమైన విద్యాబోధన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఉంటుంది. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం గురుకులాల్లో ప్రతి ఏటా ఐదు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరాల్లో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహిస్తోంది. ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించి అర్హత కలిగిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాఠాలు బోధిస్తారు. నిర్ణీత సమయంలోగా ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో గురుకులంలో మొత్తం 80 సీట్లలో రిజర్వేషన్ ప్రకారం ఎస్సీ కేటగిరీకి 60, బీసీ–సీ కి 10, ఎస్టీకి 05, బీసీ 04, ఓసీ 01 చొప్పున కేటాయిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలి.

–మళ్ల మాణిక్యం, ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం(బాలికలు), కొక్కిరాపల్లి

గోవాడ చెరకు రైతులతో నేడు ముఖాముఖి

మాజీ మంత్రి అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులతో సోమవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఆదివారం ఆయన సీతయ్యపేటలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఏకైక సుగర్ ఫ్యాక్టరీ గోవాడ ఒక్కటే అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఒక్క సుగర్ ఫ్యాక్టరీని కూటమి ప్రభుత్వం సరిగా నిర్వహించకపోగా నిర్వీర్యం చేస్తుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాను మంత్రిగా ఉన్న హయాంలో రూ.89.98 కోట్లు నిధులు మంజూరు చేసి గోవాడ ఫ్యాక్టరీ చెరకు రైతులను, కార్మికులను, ఉద్యోగులను ఆదుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నవంబర్‌లో ప్రారంభించాల్సిన క్రషింగ్‌ను జనవరి 15న ప్రారంభించారన్నారు. ఇప్పటికే 13సార్లు ఫ్యాక్టరీ క్రషింగ్ నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికి 50 వేల టన్నులు క్రషింగ్ చేయగా 35వేల టన్నులకు రైతులకు పేమెంట్లు చెల్లించలేదన్నారు. సుమారు 25 వేల మంది రైతులు, కార్మికులు ఆధారపడ్డ సుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్‌ని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. గత ఏడాది చెరకు సరఫరా చేసిన రైతులకు నేటికీ టన్నుకు రూ.150 చెల్లించకపోగా 3 నెలలుగా కార్మికులకు, ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదన్నారు. సుగర్ ఫ్యాక్టరీలో ప్రస్తుతం జరుగుతున్న తీరును తెలిసికునేందుకు సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఫ్యాక్టరీలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ తదితర ముఖ్య నేతలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ కోరుకొండ అప్పలనాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు జోగా కొండబాబు నాయకులు, సర్పంచ్‌లు వజ్రపు బాబురావు, యలమర్తి వాసు, పి. చెల్లారావు, గోపిశెట్టి శ్రీను, గొలజాన శ్రీను, ఇందలి కోటేశ్వరరావు, గోకివాడ వరకృష్ణ, గుద్దేటి శ్రీను పాల్గొన్నారు.

ఇంకా చి‘క్కే’న్!


డీలా పడిన చికెన్ అమ్మకాలు


రద్దీగా చేపల మార్కెట్

అనకాపల్లిటౌన్: బర్డ్‌ఫ్లూ సోకి కోళ్లు చనిపోతున్నాయని అపోహతో ఇంకా కొంత మంది చికెన్ తినడానికి జంకుతున్నారు. చికెన్ 80 డిగ్రీలు వేడితో వండుకొని తింటే ఎటువంటి ప్రమాదం ఉండదని నిపుణులు అవగాహన కల్పిస్తున్నా ప్రజలు భయపడుతున్నారు. మటన్, చేపలు ధరలు అధికంగా ఉన్నా వాటి వైపే అధిక శాతం ప్రజలు మొగ్గుచూపుతున్నారు. చికెన్ ధరలు వాస్తవంగా శనివారం కంటే ఆదివారం ఎక్కువగా ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా భారీగా ధర తగ్గినా చికెన్ విక్రయాలు అంతతమాత్రంగానే ఉన్నాయి. జిల్లాలో శనివారం కేజీ విత్ స్కిన్ 180 ఉండగా ఆదివారం 160, స్కిన్ లెస్ 190 నుంచి 170 రూపాయలకు తగ్గింది. మార్కెట్‌లో సేల్స్ పెంచుకోవడానికి కొందరు ఇంకో పదిరూపాయిలు తగ్గించి 160 రూపాయలకు అమ్మకాలు చేపట్టారు. అయినా అమ్మకాలు అంతంతమాత్రంగానే జరిగాయి. అవగాహన సదస్సులు, చికెన్ మేళాలు నిర్వహిస్తున్నా చికెన్ కొనడానికి వెనకడుగు వేస్తుండడం గమనార్హం.

కూటమి పాలనలో 43 మంది కార్మికుల మృతి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్


విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న మంత్రి


నూకాంబికను దర్శించుకున్న మంత్రి సుభాష్

అనకాపల్లి: జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొమ్మిది మాసాల్లోనే 43 మంది కార్మికులు మృత్యువాత పడినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎస్సెన్షియా కంపెనీలో జరిగిన సంఘటనలో 15 మంది మృత్యువాత పడ్డారని, సీఎం చంద్రబాబునాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వసుధ మిశ్రా కమిటీని ఏర్పాటు చేశారన్నారు. కమిటీ రిపోర్టు ఆధారంగా అన్ని భద్రతా చర్యలను తీసుకుంటామన్నారు. జిల్లాలో కెమికల్ కర్మాగారాలు ఉన్నాయని, ఇక్కడ త్వరలో బర్న్ వార్డులతోపాటు రెండు బర్న్ అంబులెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, పరిశ్రమల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక సేవలో మంత్రి...

ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.సుజాత అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాది వెంకన్న క్షేత్రానికి కల్యాణ శోభ

- నేటి నుంచి 15 వరకు కల్యాణోత్సవాలు
- ఏర్పాట్లు చేసిన దేవస్థానం అధికారులు
- లక్షలాది మంది భక్తుల రాకతో భారీ బందోబస్తు
- అంకురార్పణ దొంగపెండ్లితో ప్రారంభమైన వేడుకలు
- నేడు ఏకాదశి ప్రత్యేక పూజలు, రాత్రికి శ్రీనివాస కల్యాణం


రంగులు వేసి పైన నీడ వసతి కలిగేలా ఏర్పాటు చేసిన మెట్ల మార్గం


శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి క్షేత్రం కల్యాణ శోభతో కాంతులీనుతోంది. సోమవారం ఉదయం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు 152వ కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం అర్ధరాత్రి అంకురార్పణ చేసి స్వామివారి దొంగపెండ్లితో కల్యాణ వేడుకలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సోమవారం ఏకాదశి వేంకటేశ్వరస్వామి కల్యాణం జరగ్గా, ఆఖరి రోజు శనివారం రాత్రి స్వామివారి పవళింపు సేవతో వేడుకలు ముగుస్తాయి.

కోరిన కోర్కెలు తీర్చే కరుణామయుడిగా వడ్డాది వెంకన్నగా పేరొందడంతో ఏటా స్వామి వారి కల్యాణ వేడుకలను తిలకించడానికి తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. వీరి సౌకర్యార్థం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వంద మందితో ఎస్ఐ శ్రీనివాసరావు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లు, మంచినీటి సదుపాయం, వైద్య సేవలు అందేలా ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు, ఈవో శర్మ, గ్రామ పెద్దలు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలకు, మెట్లు మార్గం, కల్యాణ వేదిక, కళావేదికలకు రంగులు వేసి, విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. టికెట్ల కౌంటర్, ధ్వజ స్తంభం వద్ద, ఆలయంలోను, ఉత్సవ విగ్రహాలు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్వామివారు కొలువైన గిరిజాంబ కొండ నుంచి వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్ వరకు కిలోమీటర్ల పొడవున మిరుమిట్లు గొలిపే విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. కొండ కింద మెట్ల వద్ద భక్తులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆలయ చరిత్ర..

150 ఏళ్ల క్రితం వడ్డాది గ్రామానికి నారాయణభజీ అనే సాధువు భిక్షాటనకు వచ్చాడు. ఇక్కడ ప్రదేశాల్ని చూసి త్వరలోనే వడ్డాది పుణ్యక్షేత్రంగా భాసిల్లుతుందని చెప్పి వెళ్లిపోయాడు. ఆయన చెప్పి వెళ్లిన కొన్ని రోజులకే వడ్డాది పక్క గ్రామమైన విజయరామరాజుపేట కాళ్లవారి పాకల వద్ద రైతులు మంచి నీరు కోసం నేలబావి తవ్వుతుండగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలు బయట పడ్డాయి. అప్పటి గ్రామ పెద్ద దొండా భగవంతులయ్య గ్రామ పెద్దలతో కలిసి వడ్డాదికి తూర్పు దిక్కున ఉన్న ఎత్తయిన గిరిజాంబ కొండపై వీటిని ప్రతిష్ఠించి ఆలయం నిర్మించారు. దేవుడికి నిత్య ధూపదీప నైవేద్యాల కోసం 58 ఎకరాల భూమిని విరాళంగా అందించారు. అప్పటి నుంచి భగవంతులయ్య కుటుంబ సభ్యులు ఆలయ వంశ పారంపర్య ధర్తకర్తలుగా కొనసాగుతున్నారు.

ఐదు రోజులపాటు పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు

కల్యాణ వేడుకల్లో భాగంగా ఈ నెల 10న వివిధ పూజలు, హోమాలు, గజ, గరుడ వాహనాలపై తిరువీధి ఉత్సవం, రాత్రి 9 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 14న నాగవల్లి వసంతోత్సవం, చక్రస్నానం, 15న పుష్పాంజలి సేవ, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. వడ్డాది కొండ దిగువున, నాల్గు రోడ్ల జంక్షన్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో రోజూ రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు తిలకించేలా ఏర్పాటు చేశారు.

ఆలయానికి ఇలా చేరుకోవాలి

స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ప్రతి అరగంటకు నర్సీపట్నం, చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌ల నుంచి బస్సు సదుపాయం కలదు. విశాఖపట్నం, అనకాపల్లి, పాడేరు నుంచి వడ్డాదికి ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌గా సలీం బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సలీం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా డాక్టర్ జి.సలీం పురుషోత్తమన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ బాధ్యతలు నిర్వహించిన ఎ.కె.సక్సేనా మెయిల్‌కు ఎండీగా వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. మెకానికల్ ఇంజనీర్ అయిన సలీం 1988లో బొకారోలో మేనేజ్‌మెంట్ ట్రైనీగా తన కెరీర్‌ను ప్రారంభించారు. 1996లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో చేరారు. సర్టిఫైడ్ ఎనర్జీ మేనేజర్‌గా స్టీల్‌ప్లాంట్ ఐఎస్ఓ 50001 సర్టిఫికేషన్ పొందడంలో ఆయన గణనీయంగా దోహదపడ్డారు. 2018లో ఆయన బ్రైత్ వైట్ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో డైరెక్టర్ (ప్రొడక్షన్)గా చేరారు. అక్కడ ఒక ఏడాది పాటు డైరెక్టర్ (ఫైనాన్స్)గా బాధ్యతలు నిర్వహించారు. మూడు నెలల పాటు అక్కడ సీఎండీగా వ్యవహరించారు. 2024లో మలేషియాలోని లింకన్ యూనివర్సిటీ నుంచి ఆయన డాక్టరేట్ పొందారు.

ప్లాట్‌ఫాంపైకి రావడం అంత వీజీ కాదు

- రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ నియంత్రణకు కొత్త వ్యూహాలు
- కన్‌ఫర్మ్ టికెట్స్ ఉంటేనే ప్లాట్‌ఫాం పైకి అనుమతి
- వెయిటింగ్ లిస్ట్ ఉంటే స్టేషన్ బయట ఉన్న హాల్‌లోనే..
- త్వరలో విశాఖ రైల్వే స్టేషన్‌లో అమలుకు సన్నాహాలు

విశాఖ రైల్వేస్టేషన్ సమాచారం		
స్టేషన్ కేటగిరీ నాన్ సబర్బన్ గ్రూప్ (ఎన్ఎస్‌జీ)1	ఏటా ప్రయాణికుల రాకపోకల ద్వారా ఆదాయం సుమారు రూ.560 కోట్లు	ప్లాట్‌ఫాంలు 8
	ఏటా రాకపోకలు సాగించే ప్రయాణికులు సుమారు 2 కోట్లు	స్టేషన్‌లో మొత్తం ట్రాక్‌లు 10
		రైల్వే స్టేషన్ విస్తీర్ణం 1,110,600 చ.అడుగులు


విశాఖ రైల్వే స్టేషన్లో ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: నేను టికెట్ తీసుకున్నాను. వెయిటింగ్‌లో ఉంది. ట్రైన్ ఎక్కిన తర్వాత ఎలాగైనా కన్‌ఫర్మ్ చేయించుకుని బెర్త్‌లో హాయిగా పడుకుంటానని అనుకుంటే.. ఇకపై ఆ పప్పులింక ఉడకవ్. ఎందుకంటే టికెట్ కన్‌ఫర్మ్ అయితేనే ప్లాట్‌ఫాంపైకి వెళ్లేందుకు అనుమతి ఉంటుంది. లేదంటే కన్‌ఫర్మ్ టికెట్ ఉన్నవాళ్లు వెళ్లిన తర్వాత.. మీ టర్న్ వచ్చినప్పుడు మాత్రమే ట్రైన్ ఎక్కగలరు. ఇటీవల ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది మరణించిన దురదృష్టకర ఘటన నేపథ్యంలో, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అధ్యక్షతన ఒక అత్యున్నత సమావేశం జరిగింది. ప్లాట్‌ఫాంలపై ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలువురు నిపుణులు సూచనలు చేశారు. అనంతరం అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలను అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్లాట్‌ఫాంలపైకి ఒకేసారి ప్రయాణికులు గుంపులుగా రాకుండా నిరోధించడానికి అవసరమైన చర్యలను దేశవ్యాప్తంగా 60 ప్రధాన స్టేషన్లలో అమలు చేయాలని నిర్ణయించారు. పైలట్ ప్రాజెక్టు కింద న్యూఢిల్లీ, ఆనంద్ విహార్, వారణాసి, అయోధ్య, పాట్నా స్టేషన్లలో ఈ నిబంధనలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. రైలు వచ్చిన తర్వాత, ప్రయాణికులను ఒకరి తర్వాత ఒకరిగా, వివిధ మార్గాల ద్వారా రైలు దగ్గరకు అనుమతిస్తున్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో కూడా ఈ తరహా నిబంధనలు అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఏం చేస్తారంటే.?

- ప్లాట్‌ఫాంపై రద్దీని నియంత్రించేందుకు ఇకపై వెయిటింగ్ ప్రాంతాలను స్టేషన్ బయట ఏర్పాటు చేస్తారు. టికెట్ లేని ప్రయాణికులు కూడా స్టేషన్ వెలుపలే వేచి ఉండాలి. వెయిటింగ్ లిస్ట్‌లోని ప్రయాణికులను పంపిన తర్వాత, వారికి రైలు ఎక్కేందుకు అనుమతి లభిస్తుంది.
- ముందుగా కన్ఫార్మ్ రిజర్వేషన్ టికెట్ ఉన్న ప్రయాణికులను మాత్రమే ప్లాట్‌ఫాంపైకి అనుమతిస్తారు.
- మరోవైపు స్టేషన్లలో మరింత వెడల్పుగా ఉండే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను(వంతెనలు) నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. మహాకుంభమేళా సమయంలో ఇలాంటి వెడల్పాటి వంతెనలు సమర్థవంతంగా పని చేశాయి. ఈ నేపథ్యంలోనే స్టేషన్లలో 6 మీటర్లు, 12 మీటర్ల వెడల్పు కలిగిన ఎఫ్‌వోబీలు రాబోతున్నాయి.
- రైల్వేస్టేషన్లలో రద్దీని ఎప్పటికప్పుడు గమనించేందుకు సీసీటీవీ నిఘాను మరింత పటిష్టం చేయనున్నారు. రైల్వేస్టేషన్ల పరిసర ప్రాంతాల్లో కూడా నిఘా ఏర్పాటు చేస్తారు.
- సమన్వయాన్ని మెరుగుపరచడానికి సిబ్బందికి వాకీ టాకీలు, అత్యాధునిక అనౌన్స్‌మెంట్ సిస్టమ్, కాలింగ్ సిస్టమ్‌లతో సహా ఆధునిక డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొస్తారు.
- సంక్రాంతి, దసరా వంటి పండుగలు, సెలవుల సమయాల్లో రైల్వే స్టేషన్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ పరిధిలోని అన్ని విభాగాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ, రద్దీని నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించి అమలు చేస్తారు.
- ప్రధాన స్టేషన్లలో ఆర్థికపరమైన విషయాలపై తక్షణమే నిర్ణయాలు తీసుకునే అధికారం కలిగిన స్టేషన్ డైరెక్టర్‌ను నియమించనున్నారు. ఈ అధికారి స్టేషన్ సామర్థ్యం, రైలు లభ్యతను బట్టి టికెట్లను ఎంత వరకు విక్రయించాలనే విషయాలను నిర్ణయిస్తారు.
- ఈ ప్రాజెక్ట్ అమల్లోకి వచ్చిన తర్వాత రైల్వే స్టేషన్ ప్రవేశంపై రైల్వే శాఖ పూర్తి నియంత్రణ కలిగి ఉంటుంది. స్టేషన్‌కు చేరుకోవడానికి ఉన్న అన్ని అనధికారిక ప్రవేశ మార్గాలను మూసివేస్తారు.
- విశాఖపట్నం ఇటీవలే ‘ఏ’గ్రేడ్ స్టేషన్‌గా గుర్తింపు పొందిన నేపథ్యంలో, ఈ తరహా నిబంధనలను ఇక్కడ కూడా అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. స్టేషన్‌కు అధికారికంగా, అనధికారికంగా ఎన్ని ప్రవేశ ద్వారాలు ఉన్నాయి? నిష్క్రమణ మార్గాలు ఎన్ని ఉన్నాయి? రోజువారీ రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను అందజేయాలని రైల్వే బోర్డు ఆదేశించినట్లు సమాచారం.

క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మి తీర్థం



కనక మహాలక్ష్మి అమ్మవారు

కశింకోట: బయ్యవరంలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారి 20వ తీర్థం సోమవారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి జయ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేయనున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు. సాయంత్రం భజనలు, తప్పెటగుళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో తీర్థ మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. రాత్రికి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్ర కథ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు



నూకాంబిక అమ్మవారిని పూలమాలలతో అలంకరించి పూజలు చేస్తున్న శివగణేష్

కశింకోట: కశింకోటలోని ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మవారి ఆలయం భక్తులతో ఆదివారం కళకళలాడింది. ఎక్కువ సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. అమ్మవారు భక్తులకు దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివగణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. మొక్కుబడులు ఉన్న వారు తమ ఇళ్ల వద్ద అమ్మవారి జాగరణ చేసుకుని, అరటి గెలలు, కొబ్బరి కాయలు, స్వీట్లు తదితర పదార్థాలతో డప్పులతో సంప్రదాయంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. మరికొందరు కుటుంబ సమేతంగా వచ్చి భక్తిశ్రద్ధలతో గంప జాతరలు జరిపారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



సరుగుడు జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్య లోంచి జాలువారే నీటిలో జలకాలాట ఆడుతూ సేద తీరారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ద్విచక్ర వాహనాలు, కార్లు అధిక సంఖ్యలో రావడంతో సరుగుడు మార్గంలో రద్దీ నెలకొంది.

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	: రాజా
పౌరుషం	: సత్యనారాయణ స్క్రీన్-2 (ఉదయం, మ్యాట్నీ)
యాంటీరేష్	: సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
మజాకా	: పర్తిసాయి
ఛావా	: షిర్డీసాయి
కింగ్‌స్టన్	: వెంకటేశ్వర
తండేల్	: శ్రీసత్య
శుభం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 74 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-27 యూనిట్లు, ఓ పాజిటివ్-38 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 97036 19706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 215 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 169 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

రైల్వే గేటుతో అష్టకష్టాలు..!

- ఏఎస్ పేటలో గతంలో అండర్ పాస్‌వే ఏర్పాటుకు ప్రయత్నాలు
- ముంపు ముప్పుతో ఆగిన ప్రతిపాదనలు
- అధికంగా పాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలతో ఇబ్బందులు
- ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ప్రజల విజ్ఞప్తి



ఏఎస్ పేట రైల్వే గేటు వద్ద నిరీక్షిస్తున్న వాహన చోదకులు

కశింకోట మండలం అమీన్‌సాహెబ్‌పేట(ఏఎస్‌పేట) రైల్వే గేటు వాహన చోదకులను అష్టకష్టాల పాలుజేస్తోంది. ఈ గేటు మీదుగా రోజువారీ రైళ్లతో పాటు స్థానిక పరిశ్రమలకు కూడా గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగిస్తుండడం మరింత ఇబ్బందవుతోంది. ప్రయాణికులు అధిక సమయం గేటు వద్దే నిరీక్షించాల్సి వస్తోంది. ఫ్లైఓవర్ గానీ, అండర్ పాత్ వే గానీ ఏర్పాటు చేయాల్సి ఉన్నా అందుకు రైల్వే శాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో కష్టాలు తప్పడం లేదని వాహనచోదకులు నిట్టూరుస్తున్నారు.

కశింకోట: విశాఖ-విజయవాడ మార్గంలో కశింకోట మండలం బయ్యవరం-నరసింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఏఎస్ పేట రైల్వే గేటు ఉంది. ఈ మార్గంలో ఏఎస్‌పేట గ్రామం, శివారు నరసాపురం, గొబ్బూరుపాలెంలతోపాటు దగ్గరి దారి, బంధుత్వాలు ఎక్కువగా ఉన్న కారణంగా సోమవరం, గణపర్తి, మెలిపాక, గొబ్బూరు, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, తాళ్లపాలెం తదితర గ్రామాలకు చెందిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, జీపులు, లారీలు, స్కూలు బస్సులు నిత్యం ఇక్కడి గేటు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గేటు ఎక్కువ సంఖ్యలో రైళ్ల రాకపోకల వల్ల అధిక సమయం పాటు మూసే ఉంటోంది. దీంతో గమ్యాలకు సకాలంలో చేరుకోలేక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం వెళ్లాలంటే మరింత నరకయాతన పడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఏఎస్ పేట రైల్వే గేటు మీదుగా రోజుకు దాదాపు 200 వరకు పాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్టు, ప్రత్యేక రైళ్లు, గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సమయంలో గేటు వేయడం వల్ల ఒక రైలుకు అయితే సుమారు 5 నిమిషాలు, ఒక్కొక్కసారి రెండు, మూడు రైళ్లకు, గూడ్స్ రైళ్లకు అయితే పది నిమిషాలకు పైగా నిరీక్షించాల్సి వస్తోంది. వెనువెంటనే రైళ్లు వస్తుండంతో తెరిచిన రైలు గేటును వెంబడే మూసి వేస్తుంటారు. మరోవైపు నరసింగబిల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మూడో రైల్వే ట్రాక్ ద్వారా స్థానిక సిమెంట్, లాజిస్టిక్ పరిశ్రమలకు గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తూ ముడి, ఇతర సరకులను చేర వేసి ఉత్పత్తులను తరలిస్తుంటాయి. ఇవి నెలకు సుమారుగా 20 వరకు రైళ్లు వస్తుంటాయి. నెమ్మదిగా వెళ్లే ఈ రైళ్ల వల్ల ఎక్కువ సమయం పాటు గేటు మూసే ఉంటోంది. ఇక్కడ మరో రెండు సిమెంట్ పరిశ్రమలు కూడా తమ ఉత్పత్తులు, ముడి సరకు రవాణాకు గూడ్స్ రైళ్ల రాకపోకలకు ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇలా అయితే గేటు మరింత సమయం మూసి ఉంటుందని, రాకపోకలు సాగించడం కష్టసాధ్యంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకర ప్రమాణం

గేటు వద్ద నిరీక్షించలేక కొందరు ద్విచక్ర వాహన చోదకులు గేటు కింద నుంచి దూరి ట్రాక్ దాటుతున్నారు. ఇటువంటి సమయంలో ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా రైళ్ల వల్ల ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఫ్లైఓవర్ వంతెన గానీ, అండర్ పాత్ వే గానీ నిర్మించాలని చాలా కాలంగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అయితే మూడేళ్ల క్రితం ఇక్కడ అండర్ పాత్ వే నిర్మించడానికి అధికారులు ప్రయత్నాలు చేశారు. అవి ముందుకు సాగలేదు. అండర్ పాత్ వే నిర్మించడానికి ప్రతిపాదించిన ప్రాంతం వర్షం వస్తే నీటి ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో ఇక్కడ ఫ్లైఓవర్ వంతెన నిర్మించి తమ కష్టాలు తీర్చాలని వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మూసి ఉన్న గేటు కింద నుంచి దూరి బైక్‌తో వస్తున్న చోదకుడు



స్థానిక పరిశ్రమలకు మూడో ప్రత్యేక ట్రాక్‌పై వెళ్తున్న గూడ్స్ రైలు

ఫ్లైఓవర్ నిర్మించాలి



ఏఎస్ పేట రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలి. ఇది లేకపోవడం వల్ల రైళ్ల రాకపోకల సమయంలో ఎక్కువ సమయం గేటు వేసి ఉండడంతో గమ్యాలకు సకాలంలో చేరలేకపోతున్నాం. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం వెళ్లడం గగనంగా మారుతోంది.

– బోర నూకినాయుడు, వాహన చోదకుడు, ఏఎస్ పేట

ఎన్నాళ్లీ ఇబ్బందులు



ఏఎస్ పేట రైల్వే గేటు వద్ద నిత్యం నరకం అనుభవించాల్సి వస్తోంది. ఇక్కడ రెండు ప్రధాన రైలు మార్గాలతో పాటు స్థానిక పరిశ్రమలకు ఉన్న ప్రత్యేక రైలు మార్గం ద్వారా రాకపోకలు సాగించే గూడ్స్ రైళ్ల వల్ల ఇంకా ఎక్కువ సమయం గేటు వేసి ఉంటోంది. దీని దృష్ట్యా ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తంటపురెడ్డి తిరుమలేష్, వాహన చోదకుడు, ఏఎస్ పేట

నూకాంబిక అమ్మవారి జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో కొత్త అమావాస్య జాతర ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల రోజుపాటు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కొత్త అమావాస్య జాతర తరువాత ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో అమ్మవారి ఆలయానికి ఉత్తరాంధ్ర జిల్లాల భక్తులతో పాటు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుంటారన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఎస్.సుజాత అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

వెంకన్న వార్షిక కల్యాణం నేడు

అనకాపల్లి టౌన్: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వార్షిక కల్యాణం జరగనుంది. ఈ మేరకు మహోత్సవ పత్రికను ఆలయ ప్రాంగణంలో కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ ఈవో టి.రాజసులోచన, అర్చకుడు పులఖండం గిరిబాబు ఆదివారం ఆవిష్కరించారు. సోమవారం ఉదయం గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం స్వామివారిని పల్లకిలో ఊరేగింపు, అనంతరం రాత్రి 8.30 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకలు ఈ నెల 15వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో పులకండం ప్రసాద్‌బాబు, ధర్మకర్తలు గోలి మురళీ, సిహెచ్.నూకరాజు, వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ, సోమాదుల తులసి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

తుమ్మపాల: ఉపాధి హామీ పథకం 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టిన పనులపై రెండు రోజులుగా సోషల్ ఆడిట్ తనిఖీలు జరుగుతున్నాయి. మండలంలో ఈ నెల 7న మొదలైన తనిఖీలు 17వ తేదీ వరకు కొనసాగనున్నాయి. గ్రామాల్లో చేపట్టిన పనుల జాబితాతో పాటు కూలీల వివరాల ఆధారంగా సోషల్ ఆడిట్ బృందాలు గ్రామాల్లో పూర్తి చేసిన పనులను పరిశీలించి లెక్కలు కడుతున్నారు. దీంతో పాటు గడపగడపకు తిరిగి కూలీల నుంచి మస్టర్ వివరాలు సేకరిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి వస్తున్న సమస్యలతో పాటు మస్టర్ల నమోదు, వేతనం చెల్లింపుల్లో వసూళ్లపై కూడా ఆరా తీస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్ల జాబితాల్లో అవకతవకలకు పాల్పడినట్టు, పనికి రాకుండానే వారి కుటుంబీకుల పేర్లను మస్టర్లలో నమోదు చేసి వేతనాలు పొందినట్లు వస్తున్న ఫిర్యాదులను కూడా పరిగణనలోకి తీసుకుని తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటికే మండలంలో సీతానగరం, రొంగళివానిపాలెం, కుంచంగి, దిబ్బపాలెం, ఊడేరు గ్రామాల్లో గ్రామసభలు పూర్తవగా, వెంకుపాలెం, మాకవరం, చింతనిప్పుల అగ్రహారం, గోపాలపురం, సుందరయ్యపేట, కూండ్రం, బవులువాడ, తదితర గ్రామాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి.



రేబాకలో ఉపాధి కూలీల మస్టర్ వివరాలను తనిఖీ చేస్తున్న సోషల్ ఆడిట్ బృందం

వెదురుపర్తిలో 'విద్యార్థీ మేలుకో'

కశింకోట: పదో తరగతి విద్యార్థులు ఇటీవల రాసిన గ్రాండ్ టెస్ట్‌ల జవాబు పత్రాల మూల్యాంకనంలో సవరించిన తప్పులను పరిశీలించి సరిదిద్దుకోవాలని వెదురుపర్తి హైస్కూల్ హెచ్ఎం ఎ.వి.ఎస్.మూర్తి సూచించారు. వెదురుపర్తి గ్రామంలో 'విద్యార్థీ మేలుకో' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర విద్య, పరిశోధన సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ టెస్ట్‌ల్లో మూల్యాంకనం చేసిన జవాబు పత్రాలను ఇంటింటికి వెళ్లి టెన్త్ విద్యార్థులకు అందజేశారు. వీటిలో ఉపాధ్యాయులు సవరించిన తప్పులను పరిశీలించాలన్నారు. పలు పాఠ్యాంశాల్లో అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. ఒత్తిడి, భయం లేకుండా ఫైనల్ పరీక్షలు రాసి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలన్నారు. గ్రాండ్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ఆరోగ్యానికి వివిధ రకాల పండ్లను ఉచితంగా అందజేశారు. గతంలో నిర్వహించిన ప్రీఫైనల్ పరీక్షల కంటే ప్రస్తుత గ్రాండ్ టెస్టుల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఈ నెల 14న సమావేశం నిర్వహించి అభినందించనున్నట్లు హెచ్ఎం తెలిపారు.



వెదురుపర్తిలో విద్యార్థులకు పండ్లు అందిస్తున్న హెచ్ఎం ఎ.వి.ఎస్.మూర్తి

395 మందికి నేత్ర పరీక్షలు



బ్రాండెక్స్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అచ్యుతాపురం: మండలంలోని అధీస్థాన్(బ్రాండెక్స్) కంపెనీలో ఆదివారం నిర్వహించిన 136 వ కంటి వైద్య శిబిరంలో 395 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 313 మందికి కళ్లద్దాలు అందజేశారు. 123 మందికి పరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు అందజేశారు. 50 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని సూచించారు. కంటి శిబిరానికి విచ్చేసిన వారికి మజ్జిగ, ఫలహారం, భోజనం సమకూర్చారు.

ఏపీ సీఆర్పీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా 'సబ్బవరపు'

అనకాపల్లి టౌన్: ఏపీ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా సబ్బవరపు శంకరరావు ఎన్నికయ్యారు. స్థానిక కృష్ణవేణి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గౌరవ అధ్యక్షుడు గిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సీఆర్పీ సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికైంది. మండలం గౌరవ అధ్యక్షుడిగా శ్యామ్, అధ్యక్షుడిగా ఎస్.శంకరరావు, జనరల్ సెక్రటరీగా చిరంజీవి, కోశాధికారిగా మూర్తి, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, కన్వీనర్‌గా రమణ, కో కన్వీనర్‌గా గంగాధర్‌రావు, రావికమతం మండల కన్వీనర్‌గా రమణ, సబ్బవరం మండలం ఉమెన్స్ సెక్రటరీగా ఎం.వి.ఎస్.ఎస్.పద్మజ, సబ్బవరం మండలం లీగల్ అడ్వైజర్‌గా సతీష్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పీఏబీ ప్రకారం వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్, హెచ్ఆర్‌సీ పాలసీ అమలు, తదితర అంశాలను సాధించే దిశగా నూతన కమిటీ ప్రయత్నం చేయాలన్నారు.



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న సీఆర్పీ సభ్యులు

ఏటికొప్పాక బొమ్మల స్టాల్ సందర్శన

యలమంచిలి రూరల్: అమృత్ మహోత్సవాల్లో భాగంగా రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శనకు ఏర్పాటు చేసిన ఏటికొప్పాక లక్కబొమ్మల స్టాల్‌ను కేంద్ర టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డాక్టర్ ఎం.బీనా ఆదివారం సందర్శించారు. చివరి రోజు ప్రదర్శనలో పలువురు కేంద్ర అధికారులు, ప్రజాప్రతినిధులు లక్కబొమ్మలను చూసి ప్రశంసించారని స్టాల్ ఏర్పాటు చేసిన కళాకారుడు పెదపాటి సత్యనారాయణ శరత్ ఆదివారం రాత్రి స్థానిక విలేకరులకు తెలిపారు. లక్కబొమ్మల తయారీ విధానం గురించి ఆసక్తిగా తెలుసుకోవడంతో పాటు ఇక్కడ హస్తకళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కమిషనర్ బీనాకు వివరించినట్టు శరత్ తెలిపారు. ముఖ్యంగా ఉత్పత్తి అవుతున్న లక్కబొమ్మలకు మార్కెటింగ్ సదుపాయం, సరికొత్త డిజైన్ల తయారీపై కళాకారులకు శిక్షణ ఇప్పించాలని అధికారులను కోరినట్టు చెప్పారు.



ఏటికొప్పాక లక్కబొమ్మను కేంద్ర టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కమిషనర్ బీనాకు అందిస్తున్న కళాకారుడు పెదపాటి శరత్

వెంకన్న జాతరకు పోదాం చలోచలో..





ఆలయంలో అంకురార్పణ పూజ చేస్తున్న అర్చకులు

నక్కపల్లి: పోదాం పద ఉపమాక వెంకన్న జాతరకు అంటూ భక్త జనం పయనమైంది. సోమవారం ఉపమాకలో జరిగే జాతరలో పాల్గొని వెంకన్న కల్యాణాన్ని తిలకించేందుకు భక్త జనకోటి తరలివస్తోంది. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి నేత్రపర్వంగా జరగనుంది. ఈ వైభోగాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు ఉపమాక తరలివస్తున్నారు. ప్రతి ఏటా పాల్గుణ శుద్ధ ఏకాదశి నాడు కోనేటి రాయుని కల్యాణం వేదమంత్రోచ్ఛారణల మధ్య జరగనుంది. కల్యాణ వేంకటేశ్వరుడ్ని తిలకించేందుకు ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు ఇక్కడికి తరలివస్తారు. వేకువ జాము నుంచే ఉపమాక వెంకన్న ఆలయం భక్తకోటితో కిక్కిరిసిపోతుంది. సంతానం లేని వారు ఇక్కడ ఉన్న ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహించి, ఆలింగనం చేసుకునేందుకు పోటీ పడతారు. ఉగాది వరకు ఇక్కడ జాతర(తీర్థం) జరుగుతుంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి భక్తులు ఆదివారం సాయంత్రానికే ఉపమాక చేరుకుంటున్నారు. సోమవారం రాత్రి జరిగే స్వామి కల్యాణాన్ని తిలకించి తిరుగు ప్రయాణమవుతారు.

టీటీడీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు

ఉత్సవాలు తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూకాంప్లెక్స్‌లు, షెడ్లు, విద్యుద్దీపాలంకరణలు చేశారు. వారం రోజుల పాటు టీటీడీ అధికారులు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని బృందాలు ఇక్కడ కోలాటం నిర్వహించేందుకు తమ పేర్లు నమోదు చేయించుకున్నాయి. సోమవారం ఉదయం ప్రారంభమయ్యే జాతర మంగళవారం మధ్యాహ్నం వరకు కొనసాగుతుంది. భక్తులకు సేవా సంఘాల సభ్యులు ప్రత్యేక అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

కల్యాణ కట్ట వద్ద ప్రత్యేక క్యూకాంప్లెక్స్‌లు

తలనీలాలు సమర్పించే భక్తుల కోసం ప్రత్యేక క్యూకాంప్లెక్స్‌లు నిర్మించారు. రూ.10 టికెట్ తీసుకుని తలనీలాలు సమర్పించుకోవాల్సి ఉంటుంది. వృద్ధులు, చంటి పిల్లల కోసం ఉచితంగా పాలు సరఫరా చేయనున్నారు. తిరుపతి లడ్డూలు విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాల సాయంతో బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు.

జల్లికట్టు స్నానానికి ఏర్పాట్లు..

బందుర సరస్సు వద్ద స్నానఘట్టాలు, మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. స్వామివారి పుష్కరిణిలో జల్లికట్టు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులు చెరువులోపలికి వెళ్లకుండా 50 అడుగుల మేర రేకుతో ఫెన్సింగ్ అమర్చారు. ఈ మధ్యలోనే భక్తులు స్నానాలు చేసేందుకు షవర్లు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం నుంచే జల్లికట్టు స్నానం చేసేలా చర్యలు తీసుకున్నారు.

పటిష్ట బందోబస్తు

ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. హోంమంత్రి అనిత, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వేర్వేరుగా వచ్చి ఏర్పాట్లపై ఆదివారం సమీక్ష జరిపారు. నక్కపల్లి, అడ్డురోడ్డు, పాయకరావుపేట సీఐల ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

'సంక్రాంతికి వస్తున్నాం..' 50 రోజుల వేడుక

అనకాపల్లి: షిర్డీసాయి థియేటర్‌లో సంక్రాంతికి వస్తున్నాం సినిమా 50 రోజుల వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు చందు ఆధ్వర్యంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర కేక్ కట్ చేశారు. థియేటర్ యాజమాన్యం సత్యనారాయణ, ప్రసాద్, అభిమానులు పాల్గొన్నారు.